గంగాపురంలో వీఐపీ కాటేజీలు


స్థలాన్ని పరిశీలిస్తున్న ఆలయ ట్రస్టు సభ్యులు, గ్రామపెద్దలు

- నిర్మాణానికి ముందుకు వచ్చిన భక్తుడు
- అగ్రిమెంట్ పూర్తిచేసిన ఆలయ ట్రస్ట్ సభ్యులు
- ప్రారంభం కానున్న పనులు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్న కేశవస్వామి ఆలయ ప్రాంగణంలో త్వరలో వీఐపీ కాటేజీలు నిర్మించనున్నారు. ఈఓ కార్యాలయంకు అనుకుని ఉన్న గదులపై రూ.25లక్షల నిధులతో మూడు కాటేజీలు నిర్మించేందుకు విష్ణువర్దన్‌రెడ్డి అనే భక్తుడు ముందుకొచ్చాడు. ఈమేరకు ఆలయ ట్రస్ట్ సభ్యుల సమక్షంలో శనివారం అగ్రిమెంట్ పూర్తయింది. ఇప్పటికే దేవాదాయశాఖ ఇంజినీరింగ్ విభాగం సైతం స్థలాన్ని ఎంపికచేశారు. ఆలయంలో సాధారణ భక్తులు బసచేసేందుకు గదులతోపాటు షెడ్, కల్యాణ మంటపం అందుబాటులో ఉంది. వీఐపీలకు మాత్రం బసచేసే సదుపాయం లేదు.

పలు అభివృద్ధి కార్యక్రమాల్లో..

వనపర్తి జిల్లా కొత్తకోట మండలం అప్పరాలకి చెందిన విష్ణువర్దన్‌రెడ్డి కుటుంబీకులకు లక్ష్మీచెన్నకేశవ స్వామి ఇంటిదైవం. ఇప్పటికే ఆలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో వారు భాగస్వాములు అయ్యారు. తల్లిదండ్రులు యశోదమ్మ, రంగారెడ్డిల జ్ఞాపకార్థం కాటేజీలను నిర్మించనున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ట్రస్టు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఇదేసమయంలో రూ.25లక్షలతో మూడు కాటేజీల నిర్మాణానికి ఆయన అగ్రిమెంట్ చేశారు. నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభించి ఫిబ్రవరిలో జరిగే బ్రహ్మోత్సవాల నాటికి కాటేజీలను ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించారు.

భక్తుల సౌకర్యార్థం



లక్ష్మీచెన్నకేశవుడి సన్నిధికి వచ్చే భక్తులు ఎవరూ ఇబ్బందులు పడకూడదు. అందుకే తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మూడు వీఐపీ కాటేజీలు నిర్మించాలని అనుకున్నా. గ్రామపెద్దలు, దేవాదాయ శాఖాధికారులు సమ్మతించారు. రూ.25లక్షలతో ఆధునిక పద్ధతులతో నిర్మాణం చేయిస్తా.

– అయ్యగారి విష్ణువర్దన్‌రెడ్డి, భక్తుడు

వీఐపీలు బస చేసేందుకు సౌకర్యాలు లేవు



ఆలయానికి వీఐపీలు వస్తే వారు బస చేసేందుకు సౌకర్యాలు లేవు. విష్ణువర్దన్‌రెడ్డి కాటేజీలు నిర్మించేందుకు ముందుకొచ్చారు. ఈ ప్రతిపాదనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి సూచనలతో ఇంజనీరింగ్ విభాగం వారు స్థలాన్ని ఖరారు చేశారు. రెండు, మూడు రోజుల్లో అనమతులు రాగానే నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. బ్రహ్మోత్సవాల లోపు కాటేజీలను సిద్ధం చేస్తాం.

–దీప్తిరెడ్డి, ఈఓ, లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం, గంగాపురం

అయ్యప్ప మాలధారులకు ఘన సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: 18వసారి అయ్యప్పమాల ధరించి శబరిమలైకు వెళ్తున్న గురుస్వాములను అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచారసమితి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రం అశోక్‌టాకీస్ చౌరస్తాలోని అమావాస్య అన్నదాన మండపంలో ఘనంగా సన్మానించారు. అయ్యప్ప మాలధారులకు నారికేళం (కొబ్బరి మొక్క), పూలదండ, శాలువాలతో సత్కరించారు. అనంతరం అన్నదాన మండపం నుంచి పాదయాత్రంగా రేణుక ఎల్లమ్మ దేవాలయం వరకు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్ మాట్లాడుతూ అన్నదాన మండపంలో ఏదైనా ఒక గొప్ప కార్యక్రమం చేయాలనే ఉద్దేశంతో 30మంది అయ్యప్ప మాలధారలను సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు, గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.


సన్మాన గ్రహీతలతో ప్రచార సమితి సభ్యులు

భక్తిశ్రద్ధలతో దర్గా గంధోత్సవం

- దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం సమీపంలోని పిల్లలమర్రిలో గల హజ్రత్ సయ్యద్‌షా జమాల్ హుస్సేని చిస్తీ, సయ్యద్ కమాల్ హుస్సేనీ చిస్తీ రహెమతుల్లాఅలై దర్గా 649వ ఉర్సును ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో ప్రధానఘట్టమైన గంధోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా ముతవల్లీ షా మహ్మద్ ఫజల్‌ఖాన్ ఇంటి వద్ద నుంచి గంధాన్ని ఊరేగింపుగా రామయ్య బౌళి, అశోక్‌టాకీస్ చౌరస్తా, తిమ్మసానిపల్లి గేట్, దొడ్డలోనిపల్లి మీదుగా దర్గాకు తీసుకెళ్లారు. దర్గాలో చాదర్లు, పూలు సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు అందజేశారు. మతపెద్దలు మౌలానా మొహిసిన్‌పాష ఖాద్రీ, ముతవల్లీ షా మహ్మద్ ఫజల్‌ఖాన్, ముస్లిం పెద్దలు అబ్దుల్‌జకీ, గౌస్ మొహియొద్దీన్, మహ్మద్ ఫయాజ్ పాల్గొన్నారు.


గంధోత్సవ ఊరేగింపు

క్లుప్తంగా

మైసమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



నవాబుపేట: మండలంలోని పర్వాతాపూర్ మైసమ్మ చెంత ఆదివారం భక్తజన సందోహం నెలకొంది. ఈ సందర్భంగా అడవి మొత్తం భక్తుల అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. పచ్చని చెట్లు చెంత సెలవు రోజున జనం సేదతీరారు. రోజంతా అమ్మవారి సేవలో మునిగితేలి అడవిలో ఆహ్లాదకరమైన వాతావారణాన్ని ఆస్వాదించారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



హన్వాడ: మండలంలోని టంకర గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం కాంగ్రెస్ నాయకుడు, డీసీసీ కార్యదర్శి కృష్ణయ్య భూమిపూజ చేశారు. ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంకు వద్ద విగ్రహం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య, రాజు, ఎల్లయ్య, పెంటన్న, రాంచంద్రి, వెంకట్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత భోజనానికి 14 వారాలు



నవాబుపేట: సంతకు వచ్చే వారికి ప్రతి ఆదివారం అందించే ఉచిత భోజనం 14వారాలకు చేరింది. మండల కేంద్రానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి ప్రతి ఆదివారం ప్రజలకు భోజనం అందిస్తారు. ఈ సందర్భంగా భోజన ఏర్పాట్లపై ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యాపార సంఘం అధ్యక్షుడు సుధాకర్‌చారి, నవాబుపేట డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు అంజయ్య, నిరంజన్, నసీర్ పాల్గొన్నారు.

అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



మహబూబ్‌నగర్ (వ్యవసాయం): తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు సాలోమన్ నాయక్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి తిరుపతి నాయక్‌ల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ చైర్మన్‌గా బి.వెంకటేష్ (డీఏఓ), వైస్ చైర్మన్‌గా ఆంజనేయులు (ఏడీఏ-జడ్చర్ల), అధ్యక్షుడిగా పి.శ్రీనివాసులు (ఏఓ-మహబూబ్‌నగర్ అర్బన్), ప్రధాన కార్యదర్శిగా వి.కృష్ణ కిషోర్ (ఏఓ-నవాబుపేట), కోశాధికారిగా ఎం.రాజేంద్ర అగర్వాల్ (ఏఓ-దేవరకద్ర), సహా అధ్యక్షులుగా గోపినాథ్ (ఏఓ-జడ్చర్ల), కిరణ్‌కుమార్ (ఏఓ-హన్వాడ), ఆంజనేయులుగౌడ్ (ఏడీఏ)లను నియమించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ రాజరత్నం, అసోసియేట్ ప్రెసిడెంట్ నిశాంత్, ప్రచార కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను శాలువలు, పూలమాలలతో రాష్ట్ర బాధ్యులు ఘనంగా సన్మానించారు.

'ఎమ్మెల్యే శంకర్‌ను విమర్శిస్తే సహించం'



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను విమర్శిస్తే సహించేది లేదని రజక రిజర్వేషన్ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శివన్న హెచ్చరించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ శంకర్ ఎదుగుదలను జీర్ణించుకోలేక కొందరు దుర్మార్గులు విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆయనపై ఆరోపణలు చేస్తున్నవారు మానుకోవాలని, లేదంటే బుద్ధి చెబుతామన్నారు. ఆ సంఘం జిల్లాఅధ్యక్షుడు రాజు, నగేష్, చంద్రమౌళి, బాలు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జికి సన్మానం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులైన తేజస్వినిని, రిటైర్ట్ గిరిజన ఉద్యోగులను గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి చంద్రనాయక్, మాజీ జెడ్పీటీసీ బాల్‌సింగ్‌నాయక్, గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు శంకర్, బాలు, మహేంద్ర, లక్ష్మణ్ నాయక్, గోవింద్‌నాయక్, నాగ్యనాయక్, రాజు, జగన్నాథ్‌నాయక్, గంగారాం నాక్, సుభాష్‌నాయక్, హనుమంతు, శంకర్, నారాయణ, విజయ్, సరోజ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఎలక్ట్రికల్ అడ్‌హాక్ కమిటీ ఎన్నిక



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సీనియర్ సిటిజన్స్ ఎలక్ట్రికల్ అడ్‌హాక్ కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎస్‌టీయూసీ-327 కార్యాలయంలో ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా డి.శ్రీనివాస్‌గుప్తా, కో-కన్వీనర్‌గా నస్కంటి నాగభూషణం, కోశాధికారిగా ఎస్.నరసింహ స్వామిని ఎంపిక చేశారు. కార్యవర్గ సభ్యులుగా జగన్‌మోహన్ బాలకృష్ణ, నరసన్న, శివకుమార్, ధాములును ఎన్నుకున్నారు. అనంతరం వీరందరూ ప్రమాణ స్వీకారం చేశారు.

పంటలు, నీటివసతి ఏర్పాట్ల పరిశీలన



చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లి గ్రామంలో రూరల్ మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఎంబీఏ విద్యార్థులు రైతులు పండిస్తున్న పంటలు, నీటివసతి ఏర్పాట్లను పరిశీలించారు. ఒడిసా రాష్ట్రంలోని కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కేఐటీ)కి చెందిన ఎంబీఏ విద్యార్థులు ఆదివారం మండలంలో పర్యటించారు. గ్రామీణ ప్రజల జీవన విధానం, పంటలు, నీటివసతి తదితర అంశాలను వారు అధ్యయనం చేశారు. గ్రామంలో గ్రామ ముఖ చిత్రపటాన్ని గీసి ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు వంశీ, అజయ్‌కుమార్, దో నరి లత, అన్నారెడ్డి, గ్రామస్తులు మన్నెంగౌడ్, శాంతిరెడ్డి, లోకేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ప్రారంభం

దేవరకద్ర: మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఓ ఫిజియోథెరపీ ఆస్పత్రిని ప్రారంభించారు. పట్టణంలో ప్రజలకు ఫిజియో థెరపీ సేవలు అందించాలని ఆయన సూచించారు. వైద్య రంగంలో రోజురోజుకు కొత్త సేవలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు

భూత్పూర్: మండల కేంద్రంలోని పోచమ్మ, కట్రెమ్మ, కోట మైసమ్మ, గండదీప, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రత్యేకపూజలు చేశారు. యానగుంది గురూజీ మల్లిఖార్జునస్వామి, మంజునాథ స్వామి మూడు రోజులుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో ఆడపడుచులు, బంధువులు రావడంతో పండుగ వాతావరణం నెలకొంది. సాయంత్రం బోనాల ఊరేగింపుగా వెళ్లి దేవతా మూర్తులకు నైవేద్యం సమర్పించారు.


భూత్పూర్‌లో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: కర్నూల్ పట్టణంలో ఆదివారం జరిగిన సౌతిండియా కరాటే చాంపియన్‌షిప్‌లో శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు మాస్టర్ కె.వెంకటేశ్ తెలిపారు. 12 ఏళ్ల కటాస్ విభాగంలో హారిక, 14 ఏళ్ల విభాగంలో సాయిచరణ్ ప్రథమ స్థానాల్లో నిలిచి బంగారు పతకాలు, ఆయా విభాగాల్లో వరుణ్‌కుమార్, కిరిటీ రజత పతకాలు పొందారు. విద్యార్థులను మాస్టర్ వెంకటేశ్ అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని అన్నారు.

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన మార్షల్ ఆర్ట్స్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన కింగ్‌షోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు 7బంగారు పతకాలు, 6 రజత పతకాలు, 8 కాంస్య పతకాలు సాధించారన్నారు. విద్యార్థులను హజ్రత్ మౌలానా ఆలే మహ్మద్ షబ్బర్‌పాష ఖాద్రీ, చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, మహ్మద్ సల్మాన్ అహ్మద్‌ఖాన్, డాక్టర్ మహ్మద్ షోయబ్ అహ్మద్‌ఖాన్ అభినందించారు. సీనియర్ కరాటే మాస్టర్ తాజుద్దీన్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 40వ వార్డు పరిధిలోని న్యూటౌన్ ప్రాంతంలో ఆదివారం సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కాంగ్రెస్ నాయకులు ముజామిల్, సదత్‌ఉల్లా హుస్సేన్, షేక్‌ఆదిల్, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు. ఎదిరలో నిర్వహించిన అయ్యప్పస్వామి మహా పడిపూజకు హాజరయ్యారు. స్థానిక నాయకులు హన్మంతు, శివశంకర్, నరసింహ, చెన్నయ్య, రాములు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

సీఎం కప్ క్రీడాపోటీలు ప్రారంభం

దేవరకద్ర: మండల కేంద్రంలోని బాలుర జెడ్పీహెచ్‌ఎస్, అడవి అజిలాపూర్ యూపీఎస్ పాఠశాల, కోయిల్‌సాగర్ జెడ్పీహెచ్‌ఎస్, జీనుగరాల యూపీఎస్, డోకూర్ జెడ్పీహెచ్‌ఎస్, నాగారం, మీనుగోనిపల్లిలోని ప్రాథమిక పాఠశాలల్లో ఆదివారం సీఎం కప్ క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో విద్యార్థులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖోతో పాటు పలు క్రీడలను నిర్వహించారు.


కోయిల్‌సాగర్‌లో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకోవాలని డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్ ఆదివారం ఓప్రకటనలో తెలిపారు. గ్రామాలు, మండల, నియోజకవర్గ కేంద్రాల్లో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాలు, సేవాకార్యక్రమాలు చేపట్టాలని కోరారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉదయం 10.30గంటలకు సోనియా జన్మదిన వేడుకలు జరుగుతాయన్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. వేడుకల్లో అన్ని అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

పార్టీ కోసం పనిచేయాలి



దేవరకద్ర: బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ కోసం పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. ఆదివారం కౌకుంట్లలో ఆయన పార్టీ ముఖ్యనాయకులతో మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పదవులను పార్టీ నాయకులే దక్కించుకోవాలని కోరారు. పార్టీ పరంగా ఎవరూ పోటీ పడవద్దని అందరూ సమష్టిగా కృషిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. ప్రజ ల వద్దకు వెళ్లి కాంగ్రెస్ మోసాలను వివరించాలని అన్నారు. మాజీ ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, కేబీఆర్‌గౌడ్, జాంగీర్, కిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ఆర్టీసీ ఉద్యోగులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు విధులు నిర్వర్తిస్తూనే ఆపద సమయాల్లో ప్రయాణికులకు అండగా ఉంటూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఆదివారం సాయంత్రం 4గంటల సమయంలో కోస్గి నుంచి మహబూబ్‌నగర్ బయలుదేరిన ఆర్టీసీ బస్సులో (మహబూబ్‌నగర్ డిపో) 9నెలల గర్భిణి ఎక్కింది. హన్వాడ దాటాక ఆమెకు నొప్పులు వచ్చాయి. కండక్టర్ బ్రహ్మయ్య, డ్రైవర్ కేశవులు అప్రమత్తమై వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. బస్సు మహబూబ్‌నగర్ బస్టాండ్‌కు రాగానే ఆమెను 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు కండక్టర్, డ్రైవర్‌లు. ఈ సందర్భంగా వారిని డీఎం సుజాత, ఇతర అధికారులు అభినందించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధికే ఆరోపణలు



వనపర్తి టౌన్: స్థానిక సంస్థల్లో లబ్ధి పొందేందుకు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి తనతోపాటు ఎమ్మెల్యేపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని.. ప్రజలు ఆయనను నమ్మకనే అసెంబ్లీ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టారని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. ఆదివారం వనపర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దింపుడు కల్లం ఆశలతో బీఆర్‌ఎస్ రాజకీయాలు చేస్తోందన్నారు. వనపర్తి జిల్లా కోసం నిరంజన్‌రెడ్డి ఎన్నో పర్యాయాలు తనను బతిమాలాడారని, కొల్లాపూర్‌లోని మూడు మండలాలు కలపకపోతే జిల్లా అయ్యేదా అని ప్రశ్నించారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. ప్రజలు ప్ర భుత్వంలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను నిలదీసే అవకాశం కాంగ్రెస్ ఇస్తోందని, దీంతో తప్పులు సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నట్లు వెల్లడించారు. డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోధి దినోత్సవం



జడ్చర్ల టౌన్: పట్టణంలోని బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల బొటానికల్ గార్డెన్‌లో ఆదివారం బోధి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గార్డెన్‌లోని ఆయన విగ్రహానికి వార్డు కౌన్సిలర్ సతీష్, గార్డెన్ సమన్వయకర్త డా. సదాశివయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.గౌతమ బుద్ధుడు రావిచెట్టుకింద జ్ఞానోదయం పొందిన రోజును బోధి దినోత్సవంగా జరుపుకుంటామని వారు తెలిపారు. జీవితంలో నిజమైన శాంతి బుద్ధుని బోధనల ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. సంస్కారభారతి సభ్యుడు రాధాకృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్3 వాలంటీర్లు వనజ, వాణి పాల్గొన్నారు.

గోపురానికి శంకుస్థాపన

జడ్చర్ల: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం ముఖద్వార గోపురానికి ఆదివారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ల్ చైర్‌పర్సన్ పుష్పలత, వైస్ చైర్‌పర్సన్ సారిక, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, శశికిరణ్ పాల్గొన్నారు.

బాదేపల్లిలో మార్మోగిన అయ్యప్ప నామస్మరణ


అయ్యప్ప ఉత్సవ విగ్రహానికి అభిషేకం చేస్తున్న భక్తులు


చిన్నచింతకుంటలో మహా పడిపూజను నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పట్టణంలోని రంగారావుతోటలో రంజిత్‌బాబు ఆదివారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహించారు. ఆప్రాంతం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. కలశపూజ, గణపతి, కుమారస్వామి, శివపార్వతుల పూజలు జరిపించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అయ్యప్ప ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం చేశారు. అయ్యప్ప భక్తుల నామస్మరణల మధ్య పడిని వెలిగించారు. అయ్యప్ప భజనలు, కీర్తనలు ఆలపించారు. మాలధారులతో పాటు భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటుచేశారు. పడిపూజలో గురుస్వాములు, వందలాదిగా అయ్యప్ప మాలధారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వివిధ రకాల పూలు, పండ్లతో..

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో ఆదివారం అయ్యప్పస్వామి మహా పడిపూజను గురుస్వామి గోపికృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారి 18మెట్లను వివిధ రకాల పూలు, పండ్లతో అలంకరించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాలనుంచి అయ్యప్ప స్వామి మాలధారులు అధికసంఖ్యలో హాజరయ్యారు. గ్రామంలో అయ్యప్ప నామ స్మరణతో మార్మోగింది. ఎమ్మెల్యే సతీమణి కవిత ఈ కార్యక్రమానికి హాజరై ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.